క్లుప్తంగా

ఆలయాలకు వెండి వస్తువుల సమర్పణ



వెండి వస్తువులు అందజేసిన రంగరాజు కుటుంబ సభ్యులు

మలికిపురం: మండలంలోని మట్టపర్రులో వేంచేసిన అభయాంజనేయ స్వామి, సాయిబాబా ఆలయాలకు లక్కవరం గ్రామానికి చెందిన భక్తుడు రుద్రరాజు రంగరాజు, వెంకట మంగాయమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు రూ.50 వేలతో తయారు చేయించిన వెండి కిరీటం, అభయ హస్తాలను సమర్పించారు. గురువారం ఆలయంలో జరిగిన పూజలో వీటిని అందజేశారు.

పోటీ పరీక్షల్లో సోషల్ సైన్సెస్‌దే కీలకపాత్ర



సదస్సులో మాట్లాడుతున్న వెల్ఫేర్ అధికారి దివ్వి జ్యోతి

మలికిపురం: ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షల్లో సోషల్ సైన్సెస్ కీలకపాత్ర పోషిస్తాయని రాజోలు సోషల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దివ్వి జ్యోతి పేర్కొన్నారు. మలికిపురం ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ విభాగం ఏర్పాటు చేసిన గెస్ట్ లెక్చర్ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు వెలువడే నోటిఫికేషన్లకు ఒక క్రమపద్ధతిలో ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తారని తెలిపారు. కళాశాలలో ఏ గ్రూప్ చదివామన్నది ముఖ్యం కాదని, పోటీ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమయ్యామన్నదే ముఖ్యమని ఆమె తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిట్టాల సత్యనారాయణ, ఐక్యూ కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, రమేష్‌బాబు, ప్రసాద్, ఆంజనేయులు, కడలి శ్రీనివాస్, స్రవంతి, పావని, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్, సీ బుక్స్ పరిశీలన



అంతర్వేది దేవస్థానంలో బైక్‌ల రికార్డులను పరిశీలనలో ఎస్సై శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో గురువారం సఖినేటిపల్లి ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బైక్‌ల రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు సీ బుక్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. హెల్మెట్స్ లేని డ్రైవర్లు, ట్రిపుల్ డ్రైవింగ్ బైక్‌లు, లైసెన్స్ లేని బైక్‌లపై మొత్తం 15 కేసులు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. బైక్‌ల యజమానులకు హెల్మెట్‌లు వాడకం వల్ల కలిగే లాభాలు, బైక్‌లతో పాటు రికార్డులను వెంటబెట్టుకుని ప్రయాణించడం వంటి వాటిపై పలు సూచనలు, సలహాలు ఎస్సై శ్రీనివాసరావు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం: గ్రామంలో యువతి అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్టు పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ విలేకరులకు తెలిపారు. ఉప్పలగుప్తం మండలానికి చెందిన 26 ఏళ్ల యువతి రెండు రోజుల క్రితం పి.గన్నవరం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

తాతయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ



శృంగవరప్పాడులో తాతయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో గురువారం వైఎస్సార్ సీపీ గృహ సారథుల కన్వీనర్, పార్టీ కార్యకర్త కొల్లు తాతయ్య కుటుంబ సభ్యులను ఆ పార్టీ రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. తాతయ్య మరణం పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని గొల్లపల్లి వెల్లడించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు గెద్దం సూర్యారావు, నాయకులు యెనుముల కుమార్, రావి వెంకటేశ్వరరావు, రావి త్రిమూర్తులు, దీపాటి ఏసురత్నం పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెల్లో రచ్చబండ
- అంతర్వేది ఆలయంలో గొల్లపల్లి, పాపారాయుడు పూజలు



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గొల్లపల్లి, పాపారాయుడు, పార్టీ శ్రేణులు



పల్లిపాలెంలో సంతకాల సేకరణకు కరపత్రాలు విడుదల చేస్తున్న రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి, పరిశీలకుడు కర్రి పాపారాయుడు

సఖినేటిపల్లి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని వైఎస్సార్ సీపీ ఎట్టి పరిస్థితుల్లోను అడ్డుకుని తీరుతుందని ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ప్రకటించారు. గురువారం అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలలో జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం, గ్రామస్థాయి రచ్చబండ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా సమావేశాల్లో గ్రామాల్లో సంతకాలు సేకరణకై నిర్దేశించిన కరపత్రాలను గొల్లపల్లి, నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడుతో కలసి విడుదల చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యక్షతన ఆయా గ్రామాల రచ్చబండ సమావేశాలలో ముఖ్యఅతిథిగా గొల్లపల్లి మాట్లాడారు. పేదలకు ఉపయోగపడే రీతిలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల నిర్మాణాన్ని గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తే, నేడు చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలు ఉంటే, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 కాలేజీల నిర్మాణానికి సంకల్పించారన్నారు. వీటిలో 5 కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించగా, మరో రెండు అడ్మిషన్లకు సిద్ధంగాను, 10 కళాశాలలు నిర్మాణంలోనూ ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్పొరేట్ పక్షాన నిలిచిన చంద్రబాబు వీటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పేదల పక్షాన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచి, వారి పక్షాన ప్రతిపక్ష నేతగా ఉండి పోరాటంతో ముందుకు వెళుతున్నారని గొల్లపల్లి పేర్కొన్నారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణకు తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. మరో ముఖ్యఅతిథి, నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలకు రూ.25 లక్షలకు అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని, ప్రస్తుతం ఆరోగ్య సేవలు నిలిచిపోవడంతో పేదలు అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులకు రూ.3 వేల కోట్ల వరకూ ప్రస్తుత ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ధ్వజమెత్తారు. పేద రోగులకు బాబు సర్కార్ తీరని అన్యాయం చేసిందని ఆయన విరుచుకుపడ్డారు. జెడ్పీటీసీలు మట్టా శైలజ, బళ్ల ప్రసన్నకుమారి, మహిళా ప్రతినిధులు గుబ్బల రోజారమణి, కె.ఎస్తేరు రాణి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, జిల్లా జనరల్ సెక్రటరీ ఈద రవిరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్, నాయకులు జీ.శ్రీనివాస్, నక్కా రామారావు, నల్లి ఆశీర్వాదం, కొల్లాటి నరసింహస్వామి, గుబ్బల మనోహర్, గుబ్బల రమేష్, మోకా సురేష్, ఉచ్చుల విష్ణు, జె.ఉదయ కిరణ్, నల్లి త్రిమూర్తులు, గుర్రం జాషువా, అడబాల జానకీరామ్, మహమ్మద్ షరీఫ్, మామిడికుదురు, రాజోలు మండల అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, కట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత అంతర్వేది ఆలయంలో స్వామి వారికి గొల్లపల్లి, పాపారాయుడు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఉంచి పూజలు చేశారు.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై కోటి సంతకాల ఉద్యమం



పొట్టిలంకలో సంతకాలు సేకరిస్తున్న నియోజకవర్గ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో అందరూ భాగస్తులు కావాలని, ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరాజు కోరారు. గురువారం మండలంలోని పొట్టిలంక, కొండుకుదురు గ్రామాల్లో కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ చేపట్టారు. తొలుత గ్రామాల్లో రచ్చబండ నిర్వహించారు. గన్నవరపు శ్రీనివాసరావు, చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వైద్యులు వైద్యం అందించారని గుర్తు చేశారు. అటువంటి పేదల వైద్యాన్ని నేడు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసి ఖరీదైనదిగా మార్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రజలు తమంతటా తామే ముందుకు వచ్చి కోటి సంతకాల సేకరణలో భాగస్తులు కావాలన్నారు. ప్రజల కోసం చేసే పోరాటంలో వైఎస్సార్ సీపీకి ఎనుదన్నుగా నిలవాలన్నారు. పేద ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలకు పూర్తి సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పాము దేవీ ప్రకాష్, పొట్టిలంక పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇసుకపట్ల వెంకటరమణ, కొండుకుదురు గ్రామ పార్టీ శాఖ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, అయినవిల్లి మండల కన్వీనర్ మేడిశెట్టి శ్రీనివాసరావు, పి.గన్నవరం మండల కన్వీనర్ యన్నబత్తుల ఆనంద్, పంతాడి రాంబాబు, మేడిద సత్తిబాబు, మిండగుదిటి శిరీష్ నారాయణ, తోరం గౌతమ్, వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి విద్యాసాగర్, గుత్తుల నాగబాబు, నెల్లి దుర్గాప్రసాద్, గుమ్మడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: వస్తువులపై విధించే జీఎస్టీని ప్రజలకు, వినియోగదారులకు తెలియజేసేలా వ్యాపార సంస్థల వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. రవాణా, వాణిజ్య పన్నుల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంబాజీపేట బస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 28 శాతం జీఎస్టీని 18 శాతం తగ్గించడంతో మోటారు వాహనాల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీటీవో కె.గంగాభవాని, ఏసీటీవో టి.సత్యనారాయణ, ఎంపీడీఓ బి.మమత, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, ఎంవీఐలు కె.ఆర్.రవికుమార్, జ్యోతి సురేష్, ఏఎంవీఐ డి.కౌశిక్ పాల్గొన్నారు.

ముంపు నీటిలో పాఠశాల గ్రౌండ్



జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిలిచిన వర్షపునీరు

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్ గురువారం భారీ వర్షానికి చెరువును తలపించింది. లోతట్టుగా ఉన్న గ్రౌండ్ వర్షంనీటితో నిండి విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితని, దీని వల్ల తమ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల గ్రౌండ్ మెరక చేయాలని వారు కోరారు.

తెగుళ్లు అరికడితే మంచి దిగుబడులు



వెలిచేరులో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపేట: ఉద్యాన పంటలను నిరంతరం గమనిస్తూ వాటిపై వ్యాపించిన తెగుళ్లు, పురుగులను అరికడితే మంచి దిగుబడులతో అధిక ఆదాయం ఆర్జించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అంబాజీపేట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్ (తెగుళ్ల విభాగం), డాక్టర్ వి.అనూష (పురుగుల విభాగం) రైతులకు సూచించారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు, వద్దిపర్రు గ్రామాల్లో ఉద్యాన పంటలను కొత్తపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా పూల పంటలైన లిల్లీ, కనకాంబరం, గులాబీ, బంతి, చామంతి, అలాగే అరటి, కోకో, బొప్పాయి, కొబ్బరి పంటలను పరిశీలించారు. ఆయా పంటల్లో ఏమైనా కొత్త తెగుళ్లు వ్యాపించాయా? అని నిశితంగా పరిశీలించారు. పూల పంటల్లో తెగుళ్లు, పురుగులను గుర్తించి వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు, యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. అంతర పంటల సాగుతో అధిక ఆదాయంపై అవగాహన కల్పించారు. వెలిచేరులో మనే రాంబాబు అనే అభ్యుదయ రైతు చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ విధానాలు పరిశీలించారు. ఆ పంటల ఉత్పత్తులను మార్కెటింగ్ గురించి తెలుసుకుని, ఇంకా అధిక ఆదాయం ఎలా సాధించాలి అనే అంశంపై సూచనలు చేశారు. వద్దిపర్రులో కోకో పంటలను పరిశీలించి పూత నిలకడకు, కాయకుళ్లు నివారణకు తీసుకోవలసిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి పి.రాజు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రేణుక, రాఘవి, పలువురు రైతులు, వెలిచేరు క్లస్టర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



కొత్తపేటలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు ఏమైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ చైర్మన్ పి.శ్రీకర్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక డివిజనల్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం చైర్మన్ శ్రీకర్ అధ్యక్షతన జరిగింది. ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెండింగ్ కేసులపై తక్షణ చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి ముందుగా సమస్యలను, సలహాలు, సూచనలు పంపించాలని, సమస్యలపై తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికలు సమర్పించాలని కోరారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, స్థానిక తహసీల్దార్ వై.రాంబాబు, ఆత్రేయపురం ఎంపీడీఓ రామన్, డివిజన్‌లో పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సాంఘిక సంక్షేమ శాఖ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డీఆర్ బకాయిలను విడుదల చేయాలి



కొత్తపేట పెన్షనర్ల సంఘ భవనంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రావలసిన డీఆర్ బకాయిలను విడుదల చేయాలని కొత్తపేట పూర్వ తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు స్థానిక సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు కాశి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఏడిద సత్తిరాజు వివిధ అంశాలు ప్రస్తావించారు. ముఖ్యంగా ప్రభుత్వం చెల్లించవలసిన డీఆర్‌లు, డీఏలు తదితర అంశాలపై చర్చించారు. పెన్షనర్ల సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా సంఘ భవనంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం అకీరా కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో కంటి వైద్య నిపుణులు డాక్టర్ రత్నం సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో కొందరికి కాటరాక్ట్ ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. అలాగే రాజమహేంద్రవరం శ్రీసాయిరాం డెంటల్ కేర్ సౌజన్యంతో నిర్వహించిన దంత వైద్య శిబిరంలో దంత నిపుణులు గణేష్, షాహిద్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



రావులపాలెం సీఆర్‌సీలో గర్భిణులకు నిర్వహించిన సామూహిక శ్రీమంతాలు

రావులపాలెం: సేవా కార్యక్రమాల్లో ముందుండే సీఆర్‌సీ గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం సాయంత్రం సీఆర్‌సీ ఫంక్షన్ హాల్లో రావులపాలెం మండలంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సామూహిక సీమంతాల ఆహ్వాన వేడుక పేరుతో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ సిబ్బంది సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులను యువరాణుల్లా అలంకరించి సీమంతాలు చేశారు. వారికి పండ్లు, పూలు, కుంకుమ, గాజులు, చీర, సారెను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కార్యదర్శి వీర రాఘవరెడ్డి, సేవా విభాగం డైరెక్టర్ సత్తి సూర్యభాస్కరరెడ్డి (చిన్నబుజ్జి), ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



చింతలపల్లి సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

రాజోలు: ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసేందుకు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు అన్నారు. గురువారం పీఆర్‌టీయూ నాయకులు కాట్రేనిపాడు, చింతలపల్లి, శివకోడు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర నాయకులు ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. రాజోలు మండల శాఖ నాయకులు డి.వెంకట సుబ్రహ్మణ్యం, మామిడిశెట్టి గోపాలకృష్ణ, అప్పారి రామకృష్ణ, గుబ్బల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు స్ఫూర్తిదాయకం



దాతల సాయంతో సమకూర్చిన వసతులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవాణి, జెడ్పీటీసీ ప్రసన్న

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న ఆర్థిక సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి అన్నారు. దాతల ఆర్థిక సాయంతో సమకూర్చిన పలు వసతులను గురువారం ఇరువురూ ప్రారంభించారు. సమావేశంలో మాట్లాడుతూ గ్రామ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దాతల సేవలను నిలబెట్టాలని సూచించారు. గ్రామానికి చెందిన దంతులూరి సూర్యకాంతం పాఠశాల ఆవరణలో మీటింగ్ హాలు నిర్మాణం చేశారు. అలాగే నాయుడు సుబ్బారావు, నల్లపురాజు వెంకటేశ్వరరాజు, నల్లపురాజు వెంకట సుబ్బరాజుల ఆర్థిక సాయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణం చేశారు. కడలి బాబూరావు అందించిన రూ.25 వేలతో సౌండ్ సిస్టం సమకూర్చారు. పేపకాయల రామకృష్ణ ఆర్థిక సాయంతో హాట్ అండ్ కూల్ వాటర్ డిస్పెన్సర్ సమకూర్చారు. తోట శ్రీను, అప్పన బాబ్జి, కంకటాల చంద్రశేఖర్‌ల ఆర్థిక సాయంతో ఫ్యాన్లు బహూకరించారు. వీటిని ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో గ్రామ పెద్దలు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెన్మెత్స రంగరాజు, సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, నల్లి ప్రసాద్, ఎంఈఓలు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొణిదెల అన్నవరం, పాఠశాల కమిటీ చైర్మన్ కట్టా వాసు, చెల్లింగి సత్యనారాయణ, దంతులూరి శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా చేరిన టీచర్లకు ఎస్‌ఆర్‌ల అందజేత

సఖినేటిపల్లి: మండలంలో కొత్తగా టీచర్లుగా చేరిన వారికి గురువారం సర్వీస్ రిజిస్టర్(ఎస్ఆర్)లను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు సఖినేటిపల్లిలో అందజేశారు. ఈ మేరకు వారిని అభినందిస్తూ, ఉపాధ్యాయ వృత్తిలో అత్యున్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. సదరు సంఘ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి ఉండపల్లి గిరిబాబు, సభ్యులు కేవీ సత్యనారాయణ, జె.వీర్రాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి అధ్యాపకులు చెప్పే సబ్జెక్టులపై క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడం వల్ల భవిష్యత్ బంగారుబాట అవుతుందని జిల్లా జూనియర్ కళాశాల ఇనస్పెక్షన్ అధికారి వనుము సోమశేఖరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. సోమశేఖరరావు మాట్లాడుతూ సబ్జెక్టుల పట్ల కష్టపడి ఇష్టంగా చదవడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. అధ్యాపకులు చెప్పే అంశాలను విద్యార్థులు ఆకళింపు చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం సోమశేఖరరావును ఎంఈఓ మోకా ప్రకాష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కడలి సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమ్మర్లకు మట్టి తీసుకునే విధంగా భూములు కల్పించాలి

అంబాజీపేట: జీవనాధారమైన కుమ్మర్లకు మట్టి తీసుకునే విధంగా ప్రభుత్వం భూములు కల్పించి తమను ఆదుకునేలా చూడాలని రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి చైర్మన్ పేరేపి ఈశ్వర్‌ను కోనసీమ శాలివాహన డైరెక్టర్ మాచవరపు విజయ్‌కుమార్‌లను కుమ్మర్లు కోరారు. మాచవరంలో ఉన్న కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ భవనంలో శాలివాహనులతో కలసి ఆర్థిక స్థితిగతులపై గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం గంగలకుర్రులో కుండల తయారీ కేంద్రాలను సందర్శించారు. కుమ్మర్లు మాట్లాడుతూ కుండలు తయారు చేయుటకు మట్టి లభించక చాలా ఇబ్బందిగా ఉందని వివరించారు. ప్రభుత్వ చొరవతో మట్టిని ఉచితంగా తీసుకునేలా భూములను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, పాలకొల్లు వెంకటరమణ, చిరతపూడి వెంకటేశ్వరరావు, మానేపల్లి రామకృష్ణ, చిరతపూడి హేమలత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

26న మదనపల్లిలో శతాధిక కవి సమ్మేళనం

సఖినేటిపల్లి: ఈ నెల 26న అన్నమయ్య జిల్లా మదనపల్లిలో అన్నమయ్య సాహితీ ఉత్సవం పేరిట శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శతాధిక కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు. గురువారం సఖినేటిపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ శతాధిక కవి సమ్మేళనానికి ఢిల్లీ, ఒడిశా, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 150 మంది కవులు హాజరు కానున్నట్టు, ఇందుకు సంబంధించిన ప్రక్రియ పర్యవేక్షిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న 158వ సాహిత్య సదస్సుగా నమోదు కానుందని, ఇందులో కవితాగానం, పుస్తకావిష్కరణలు ఏర్పాటు చేశామన్నారు. ఏ విధమైన ఫీజులు లేకుండా పాల్గొన్న కవులు, కళాకారులను ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరిస్తామన్నారు.

ఘనంగా సామూహిక సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు: పాశర్లపూడి ఉమా చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సామూహిక సత్యసాయి వ్రతాలు ఘనంగా జరిగాయి. 120 మంది భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. సత్యసాయి వ్రతాలు ఆచరించారు. బోనం బాపూజీ స్వగృహం వద్ద నుంచి స్వామి వారి దివ్య పాదుకలు, దివ్య వస్త్రం, పూర్ణ కలశం స్వామి వారి రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ వావిరాల సత్యనారాయణ శాస్త్రితో సత్యం, శివం, సుందరం 27వ రోజు పారాయణ కూడా ఘనంగా జరిపించారు. అనంతరం రఘుపతి మాస్టర్ బ్రహ్మత్వంలో సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరించారు. మహా మంగళహారతి, తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించారు. కోనసీమ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబుతో పాటు పలువురు ప్రముఖులు ఈ పూజల్లో పాల్గొన్నారు. పలువురు భక్తులు పూజలో పాల్గొన్న వారికి సేవలందించారు.